
# కనపడని కౌగిలి

'అపర్ణ'



"జీవితంలో వున్న ట్రాజెడీలు రెండే రెండు. ఒకటి - నువ్వు కోరుకున్నది జరగటం- రెండవది జరగక పోవటం" జీవితాన్ని ఎంత అందంగా వ్యాఖ్యానించాడు బెర్నార్డ్‌షా!

ఆలోచనల మధ్య నుండి తలఎత్తి చూశాడు విజయసారధి. అందమైన పేపర్ వెయిటుక్రింద అణిగి వున్న నీలిరంగు కాగితం గాలికి చిలిపిగా కదులుతోంది.

చేతిలో ఎర్రగా కాలుతున్న సిగరెట్టుని ఏష్ ట్రేకో వదేసి విసురుగా గార్డెన్ కుర్చీని వెనక్కి తోసేసి ప్రక్కనే వున్న పడక గదిలోకి వెళ్ళాడు.

ఖరీదయిన స్టీల్ ఫ్రేములోంచి చిలిపిగా నవ్వుతోంది రూత్ ఫొటో. కొన్ని క్షణాలపాటు తదేకంగా ఆ నీలివర్ణం కళ్ళల్లోకి చూస్తూ నిలబడి పోయాడు సారధి.

డియర్ విజయ్!

నీ సాహసానికి ఆశ్చర్యపోతున్నాను. అందరి చేత తెలివిగలవాన్ని అనిపించుకున్న నన్నే మోసం చేశావు. కానీ మోసం కలకాలం నిలవదు అని మరచిపోకు!

అమాయకంగా కనిపించే నీలోనూ యిన్ని కుట్ర ఆలోచనలు దాగి వుంటాయని నేను అనుకో లేదు. అందుకు ఎలాంటి అనుమానమూ లేకుండా నిన్ను పెళ్ళిచేసుకున్నాను.

జరిగిపోయిన దాన్ని తవ్వుకుని విచారించటం నా పద్ధతి కాదు. జరగబోయే దేమిటో ముందుగా నీకు తెలియటం మంచిదని వ్రాస్తున్నాను.

నువ్వు యిక్కడ నుండి వెళ్ళక ముందే నీకు పెళ్ళియ్యిందని, ఇండియాలో నీకు భార్యా, పిల్లలూ వున్నారని నాకు తెలిసింది. కానీ అదెంత వరకూ నిజమో తేల్చుకోకుండానే గాలి వార్తలని నమ్మటం యిష్టంలేక ఏమీ తెలియనట్లు మౌనంగా వుండిపోయాను. అంతలో నువ్వు ఇండియా వెళ్ళిపోయావు. ఎప్పటిలా అమాయకత్వాన్ని నటిస్తూ నాకు ఉత్తరాలు వ్రాస్తున్నావు. యిక్కడికి తిరిగివచ్చేయాలని ప్రయత్నిస్తున్నావనీ, అది కుదరకపోతే నన్నే రమ్మని చాలా తెలివిగా వ్రాస్తున్నావు.

కానీ డియర్! నాకు తెలుసు. నువ్వు నామీద చూపించే ప్రేమంతా నా ఆస్తికోసమని. నిన్ను నమ్మి మోసపోయేటంతటి తెలివి తక్కువదాన్ని కాదు నేను.

ఇదివరలో నీకు పెళ్ళి కావటంతో మన వివాహం ఎలాగూ చట్ట సమ్మతం కాదు. ఇంకా జాన్ సంగతి, వాడిమీద నీకెలాంటి అధికారమూ లేదనను కానీ నా బిడ్డ ఎక్కడ ఎవరి దయా దాక్షిణ్యాల మీదా ఆధారపడి బ్రతకవలసిన అవసరం ఏముంది? నా దగ్గరున్న ఐదేళ్ళల్లోనూ ఒక్కసారయినా నీ కొడుకుని గురించి అయినా తలచని నీ పత్ని హృదయం ఎంత గొప్పదో నేను అర్థం చేసుకోలేనంటావా?

త్వరలో అన్ని విషయాలనీ మా లాయరు నీతో సంప్రదిస్తారు. మన యిద్దరి మధ్యా ఎలాంటి గొడవలూ లేకుండా వ్యవహారం సెటిల్ కాగానే మిస్టర్ బార్టసర్‌ని వివాహం చేసుకోబోతున్నాను. ఇనుక నువ్వింకా ఎలాటి ఆశలూ పెట్టుకోవద్దు.

జీవితంలో తిరిగి మనిద్దరం కలుసుకుంటామని నేను అనుకోను. ఇప్పటికయినా జీవితంలో స్థిరపడి నీ భార్యాబిడ్డలతో సుఖంగా వుంటావని ఆశిస్తూ శాశ్వతంగా సెలవు తీసుకుంటున్నాను...

మరీ పలుచగా గులాబీ రేకుల్లా వుండే ఎర్రని లిప్‌స్టిక్ పెదవులు సన్నగా కదులుతూ తనతో మాట్లాడుతున్నట్టు అనిపించింది. అలాగే ఫొటో వైపు చూస్తూ నిలబడిపోయాడు.

అమాయకంగా నవ్వుతున్న జాన్ ఫొటో వైపు అరక్షణం పాటు చూసి నెమ్మదిగా స్టీల్ బీరువా

తెరిచాడు.

ఎన్ని ఆశలు పెట్టుకున్నాడు తను ! రూత్‌కి ఎన్నటికీ ఈ నిజం తెలియకూడదని తను చేసిన ప్రయత్నం అంతా వ్యర్థమే అయ్యింది. ఎక్కడ మారు మూల దేశంలో వున్న తన భార్యాబిడ్డల గురించి రూత్‌కి తెలియదనీ, తెలిసినా అంతగా పట్టించుకోదనీ అనుకున్నాడు.

వీలయినంత త్వరలో యిక్కడ వ్యవహారాలన్నిటినీ శాశ్వతంగా పరిష్కరించుకుని తిరిగి తను అమెరికా వెళ్ళిపోవాలని అనుకుంటూ వుంటే రూత్ ఎంత తెలివిగా తనకి గుడ్‌బై చెప్పింది!

ఆరేళ్ళు అమెరికాలో వుండి ఆ దేశ ఆచార వ్యవహారాలకి, నాగరికతకీ బాగా అలవాటు పడిపోయిన తనకి యిక్కడ వుండటం ముళ్ళమీద వున్నట్టే వుంది.

పాతిక సంవత్సరాలు పెరిగిన ఈ దేశం నాది అని చెప్పుకోవటానికి తనకి సిగ్గుగా వుంది. ఎదిగీ ఎదగని ఈ మనుష్యుల మధ్య తను బ్రతకటం ఎలా ?

అమెరికా నుండి వచ్చిన రెండు నెలల వరకూ తనకి తగిన ఉద్యోగమే దొరకలేదు. చివరికి తప్పనిసరిగా ఒక లెక్చరర్‌గా కాలేజీలో చేరాడు. కానీ ఈ జీతమూ ఈ పనీ తనకి బొత్తిగా నచ్చలేదు.

జీవితాన్ని అనుభవించటం బొత్తిగా తెలియదు వీళ్ళకి. సుఖపడే వారిని చూసి అసూయతో చెవులు కొరుక్కుంటారు. ఉన్నవీ లేనివీ ప్రచారం చేస్తూ వింతగా వ్యాఖ్యానిస్తారు.

చిన్నప్పటినుండీ జీవితంలో అన్నిటినీ అనుభవించాలనే కోరిక తనకి వుండేది. స్కూలు ఫైనల్ చదివే రోజుల్లోనే చాటుగా సిగరెట్లు త్రాగటం నేర్చుకున్నాడు. కాలేజీలో ఫైనలియర్‌లో మొదటిసారి బ్రాందీ రుచిచూసే అవకాశం కలిగింది. అది అమెరికాలో ఒక అలవాటుగా మారింది.

ఒకదాని తరువాత ఒకటి వరుసగా గ్లాసులు ఖాళీ అవుతున్నాయి.

ఎంత తాగినా మత్తులోపడి తూలకుండా చురుకుగా పని చేసుకుని పోగల తనని చూసి విదేశీయులే ఆశ్చర్యపోయేవారు. తను ఫుల్‌డోస్‌లో ఆఫీసుకి వెళ్ళి మామూలుగా పనిచేసుకునిపోగలుగుతుండే ఇక్కడ అందరికీ విడ్డూరంగా ఉంది.

మంచి విస్కీ అయినా దొరకని ఈ దేశంలో తను ఏ విధంగా సెటిల్ కాగలడు ?

— దొంగచాటుగా సంపాదించిన విదేశీ సరుకు చివరి సీసాని ఖాళీచేస్తూ ఆలోచిస్తున్నాడు సారధి.

తన భవిష్యత్తు ఏమిటి ? మదిమి – మగువ అందుబాటులో వున్నా, జీవితాన్ని ఎంతగా అనుభవించినా ప్రతి వాడికీ ఒక ఇల్లు – ఇల్లాలు అంటూ ఉండాలి. అవి లేనినాడు అది సంపూర్ణ జీవితమే అవుతుంది.

అతనికి అకస్మాత్తుగా గుర్తుకి వచ్చింది వసుంధర.

అవును, వసుంధర ! అనుకున్నాడు కొత్తగా ఆమె గురించి ఆలోచిస్తూ.

జీవితంనుండి సాధ్యమైనంతవరకూ అనందాన్ని పిండుకుని అనుభవించేయాలనే తత్వం సారధిది.

కాలేజీలో చదివే రోజుల్లో అతను ప్రేమించాడు. కులాసాగా సినిమాకి షికార్లకి ప్రేమ విహారాలు సాగించాడు. పెళ్ళి చేసుకుందాం అని చందమామ సాక్షిగా వాగ్దానంకూడా చేశాడు. తండ్రివి కాబోతున్నావని ఆ పిల్ల భయపడుతూ ముడుచుకునిపోతూ చెబితే "ఏం పర్వాలేదు త్వరలో ముహూర్తం పెట్టించేస్తా" నంటూ నిబ్బరంగా ధైర్యం చెప్పాడు.

కులంఒకటి కాదని, తల్లీ తండ్రి చెప్పే అభ్యంతరాలను, అభ్యర్థనలను సారధి పట్టించుకోలేదు. కానీ అగని ఆలోచనలని జీవితాన్ని మార్చివేసింది మేనమామ చెప్పిన తియ్యటి వార్త.

బి. ఏ. చదువుతున్న వసుంధరని చూడటానికి ఒకవిధంగా బలవంతంగానే తీసుకొని వెళ్ళాడు మేనమామ. పిల్ల అందంగానే వుంది విద్యావంతురాలు. అన్నిటినీ మించి నలభైవేల రూపాయలు

---

ఆరోజే నాటకం... హీరో విలన్‌తో అన్నాడూ "నాటకం ప్రకారం నిన్ను చివరి అంకంలో చంపాల్సి వుంది. కాని మొదటి అంకంలో చంపేస్తాను" అని.



"ఏం, ఎందుకని ?" ఆదుర్దాగా అడిగాడు విలన్.

"నిన్నూ, నీ నటననీ చివరిదాకా చూస్తే జనం నిజంగా చంపేసారు. ఆ ఛాన్సు వాళ్ళకెందుకివ్వాలనీ ముందే చంపేస్తాను.

---

కట్నంగా తీసుకుని వస్తుంది – అది బాగా నచ్చింది సారధికి.

నలభైవేల రూపాయలు అంటే మాటలుకాదు. ఎన్ని సంవత్సరాలు ఉద్యోగంచేసినా అంత డబ్బు తను సంపాదించలేడు. ఆ మాత్రం కష్టపడి సంపాదించకుండా వసుంధర మెడలో మూడు ముళ్లు వేసినా భాగ్యానికి అంత సొమ్ము తనది అవుతుంది.

ఫారిన్ వెళ్ళాలనే కోరిక చిన్నతనంనుండీ తనకుంది. నిజం చెప్పాలంటే ఫారిన్ వెళ్ళటమే తన జీవిత ధ్యేయం.

శ్యామలని మోసం చేయాలని తను అనుకోలేదు. కానీ ఆమెకోసం విదేశాలకి వెళ్ళగల అవకాశాన్ని మాత్రం వదులుకోలేదు. ముందు ముందు తనకెంతో మంచి భవిష్యత్తు వుంటుంది చేజేతులారా ఈ అవకాశాన్ని వదులుకుని శ్యామలని చేసుకుంటే ఎన్నో ఇబ్బందులకి గురి కావలసివస్తుంది. కని పెంచిన వాళ్ళని దూరం చేసుకుని, సాంఘిక ఆచారాలని, వసంతాన్ని ఎదిరించి కోరి కష్టనష్టాలని తెచ్చుకోవటం కంటే నలభైవేల రూపాయలతో వచ్చిన్న వసుంధరని చేసుకోవటంలో చాలా లాభాలు కనిపించాయి.

శ్యామల గురించి తను ఆలోచించి ప్రయోజనం లేదు. తనతో పరిచయాన్ని ప్రణయం వరకూ సాగించిన శ్యామల ఎలాగయినా బ్రతకగలదు. ఒకవేళ బ్రతకలేక పోయినా దానికి తనుబాధ్యుడు కాడు. "అరిటాకు ముల్లు మీద పడినా ముల్లే వచ్చి అరిటాకు మీద పడినా" ఫలితం ఒకటేనన్న జ్ఞానం ఆ అమ్మాయికి వుండవలసింది.

శ్యామలతో పరిచయం కొది నెలలు మాత్రమే. ఇన్ని సంవత్సరాలు పెంచి పెద్దచేసిన కన్నవాళ్ళకంటే నిన్నటివరకూ శ్యామల ఎక్కువగా కనిపించినమాట వాస్తవమే. కానీ ముందు యింకా ఎంతో భవిష్యత్తు వుంది. అందుకే కొంచెం సంకోచం తనెందుకు పడటంకోవాలి.

మరింకా ఎక్కువగా ఆలోచించి ఆవసరంగా బాధపడటం సారధికి నచ్చలేదు. వసుంధరని చేసుకోవటానికి తన అంగీకారం తెలియచేశాడు.

పెళ్ళి తిరగకుండానే వైభవంగా వివాహం జరిగిపోయింది.

శ్యామల కన్నీళ్ళకి వెలకట్టి ఉదారంగా కొంత డబ్బు యివ్వబోయాడు. అభిమానంతో ఆ అమ్మాయి తిరస్కరిస్తే నకిలీ మంచిది పోమ్మన్నాడు. చాలా తేలికగా గట్టు దాటి కోకుండా ఆ సమస్య పరిష్కారం అయినందుకు ఎంతగానో సంతోషించాడు కూడా.

వసుంధరకి మూడో నెల వచ్చేసరికి కాలేజీకి వెళ్ళటం మానివేసింది. ఇంకా అమ్మగారింట్లో వుండటం బావుండదని వేరే కాపురం పెట్టమని వసుంధర చేసే గోల వినిపించుకోకుండా తనకి కట్నం కాకుండా డబ్బులు కావాలని మామగారిని అడిగి రొఖ్ఖం అంతా తన కివ్వమని సారధి వేధించటం మొదలు పెట్టాడు. ఆ విషయంలో భార్య తటస్థంగా వుండిపోవటంతో మేనమామ చేత అడిగించాడు ఫారిన్ వెళ్ళటానికి డబ్బు కావాలని.

కొడుకులలో దొరసానులు ఎన్నెన్ని వికసిస్తున్నా అలాటి బుద్ధిమంతుడూ, గుణవంతుడూ అయినా అలాంటి పన్ని వశం చేసుకుంటారని భయంతో, ఒక్కగానొక్క కూతుర్ని విడిచిపెట్టి అల్లుడు ఎక్కడో దేశంకాని దేశంలో వుంటాడనటం బొత్తిగా నచ్చక మామగారు అల్లుడికి కానీ కూడా యివ్వనని కూతురి పేరిట నోట్లు వ్రాయించి వుంచి బాధం వస్తుందని ఆ డబ్బంతా వడ్డీకిచ్చాడు.

సారధికి పట్టుదల పెరిగింది. వసుంధరకి తొమ్మిదవ నెల వచ్చేసరికి స్నేహితుల సహాయంతో డబ్బు పోగుచేసుకుని అమెరికా వెళ్ళాడు.

అప్పటినుండీ కొడుకుకి మూడేళ్లు వచ్చేవరకూ ఎలాగో ఆపస్థపడి భర్త అడ్రసు తెలుసుకుని ఉత్తరాలు వ్రాసేది వసుంధర. వెళ్ళిన కొత్తలో కొన్ని సమాధానాలు వ్రాయకపోయినా ఓపికగా ఉత్తరాలు చదివేవాడు. చివరికి అవి చదవడానికి వసరం కూడా లేదని చించి అవతల పడేసేవాడు.

బాటిల్‌లో చివరి బొట్టుని కూడా ఒక గ్లాసు

త్రాగా గ్లాసులోకి వంచుకుని నిర్లక్ష్యంగా ఖాళీ సీసాని, గ్లాసుని ప్రాముఖ్యమైన వదిలేసి సోఫాలో వెనక్కి వాలిపోయి వసుంధర రూపాన్ని. ఆమె అభిమానాన్ని గుర్తుతెచ్చుకుంటూ, తనేవిధంగా ఆమెని క్షమాపణ అడగాలో, ఎంత సామరస్యంగా నూతన జీవితాన్ని ఆరంభించాలో ఆలోచిస్తున్నాడు.

'అంతా మీ కోరికే! ఆ కళ్ళూ, ఆ పెదవులూ అన్నీ మీవే! నా బాబు నవ్వితే అచ్చు మీరు నవ్వినట్టే వుంటుంది'. బాబు పుట్టిన ఆరు నెలలకు కాబోలు వాడి ఫోటోని పంపుతూ, వాడెలా వుంటాడో వర్ణిస్తూ వాడు అందరితో తననెలా అలరిస్తున్నాడో, ప్రక్కన సారథిలేని లోటు ఎంత బరువుగా వున్నదో వ్రాస్తూ అవసరమైతే బాబుని అక్కడ వదిలేసి వస్తానని. తను రావటానికి అవసరమయిన ఏర్పాట్లు చేయమనీ వ్రాసింది వసుంధర.

కనులారా చూసి ఎరుగని కన్నబిడ్డని తలుచుకోగానే సారథికి ఎక్కడలేని ఉత్సాహమూ వచ్చింది. వాడిప్పుడెలా వుంటాడో, అన్న ఆలోచనతో హాయిగా నవ్వుకున్నాడు. వసుంధర తననితండ్రిగా బాబుకి పరిచయం చేస్తూంటే వాడి కళ్ళల్లో వెలిగే కాంతిని తన హృదయంలో దాచుకోవాలి.

దీర్ఘ వియోగంతో తన రాకకోసం ఎదురు చూసి చూసి ఓపిగిపోయి నిరాశని పెంచుకున్న వసుంధర తనని హఠాత్తుగా చూసి ఏమౌతుందో తే — ఆ దృశ్యం అతని కనులముందు కదిలింది. ఆనందం. విచార కలబోసిన భావాలతో కంటతడి పెట్టుకుంటున్న వసుంధరని ఆప్యాయంగా కౌగిలిలోకి తీసుకుని ప్రేమపూర్వకంగా కళ్ళు తుడుస్తూ, అనురాగంతో అనునయిస్తూ ఓదారుస్తాడు.

నూతన జీవితం గురించిన ఆలోచనలతో అతని మనసు తేలిక పడింది.

"అయ్యగారూ" ఎంతసేపటినుండీ నిలబడ్డాడో వినయంగా చేతులు కట్టుకుని నిలబడిన పనివాడి పిలుపు విని నెమ్మదిగా కళ్ళు తెరిచి చూశాడు.

అదేదో సుమహారమైన పూవులా ఎక్కడ నలిగి పోతుందో అన్నంత జాగ్రత్తగా రెండు చేతులతో అందించాడు ఒక సీలిరింగు కవరుని.

తన పనులన్నిటినీ అంత శ్రద్ధగా చేసి పెడుతున్నందుకు అతనివైపు మెచ్చుకోలుగా చూసి సాలోచనగా కవరు అందుకున్నాడు సారథి.

ఎక్కడో, ఎప్పుడో ఆ వ్రాత చూసినట్టే వుంది. కానీ ఎవరిదో గుర్తురాక ఆ కవరు అటూ యిటూ తిప్పి చూశాడు. ఇండియాలో తనకు ఉత్తరాలు వ్రాసేవాళ్ళు ఎవరున్నారు?

కోడలిని ఏలుకోవటంలేదన్న కోపంతో తండ్రి రాకపోకలే మానివేశాడు. తల్లిమాత్రం ఆగలేక ఎప్పుడయినా వస్తూ ఉంటుంది. కానీ తను రాగటం యింటివచ్చే రకరకాల అమ్మాయిలని చూడలేక గట్టిగా చెప్పనూలేక వచ్చిన మూడోరోజే తిరుగు ప్రయాణం కడుతుంది. దాదాపు దగ్గర బంధువులందరూ అంతే! డబ్బు అవసరమయితే వెదుక్కుంటూ వస్తారు. ఆ సమయానికివుంటే ఇస్తాడు లేకపోతే లేదు. పని జరిగాక యింకో క్షణం కూడా ఉండరు.

కొన్ని క్షణాలపాటు పోస్టల్‌ముద్రని తదేకంగా చూసి నెమ్మదిగా కవరు చింపాడు.


శ్రీ విజయసారధిగారికి:

నమస్కారములు. బహుశా నన్ను మరచిపోయే ఉంటారు. ఇదివరలో చాలాసార్లు నా ఉత్తరాలతో మిమ్మల్ని విసిగించాను.

సారథి వదనం వికసించింది. అందంగా ముత్యాల వరుసలావున్న ఆ చేతివ్రాత వసుంధరది!

సన్నగా పొడుగ్గా, అమాయకంగా, అందంగా వుండే వసుంధర - ఎనిమిది సంవత్సరాల క్రితం తన జీవితంలో ప్రవేశించిన అర్ధాంగి - తనతో కలిసివున్నది కొన్ని నెలలే అయినా తన చుట్టూ ఎన్నెన్నో కోరికలని, కలలని అల్లుకుని తన తోటిదే జీవితం అని నమ్మిన భార్య రూపం అతని కళ్ళముందు నిలిచింది.

యం. ఏ. పాసయ్యి ఆఫీసరుగా ఎక్కడో పని చేస్తోందని తల్లి చెప్పటం గుర్తుకి వచ్చింది సారథికి.




అమాయకత్వం కరిగిపోయి. కపటిపోయిన కాలం నేర్పిన అనుభవాలతో హుందాగా నిలబడి తన వైపు అభిమానంతో చూస్తున్న వసుంధర రూపాన్ని ఊహించుకుంటూ అమితాసక్తితో ఉత్తరం పూర్తిగా చదివాడు.

కొందరి జీవితాలు చాలా చిత్రంగా వుంటాయి. బాధలూ, సమస్యలూ అంటే ఏమిటో ఎరుగకుండా పెరిగాను. సరదాగా ఆడుతూ పాడుతూ కాలేజీలో చదువుకుంటున్న నా జీవితంలో మీరు అడుగు పెట్టిన క్షణం నుండే నా జీవనగతి మారిపోయింది.

కేవలం కట్నంకోసం ఆశపడి మీ వంటి వివేకవంతులు, విద్యావంతులు చేసుకుని ఆడపిల్లల జీవితాలతో ఎందుకు ఆటలాడుతారో నాకింత వరకూ అర్థం కాదు.

మీ స్వార్థమే మీరు చూసుకున్నారు. కట్టుకున్న భార్య విలువ మీకు తెలియదు. కన్నబిడ్డమీద మమత కంటే మీ భోగాలే మీకు ముఖ్యం.

విదేశాలకి వెళ్ళాలి, పై చదువులు చదవాలి డబ్బు సంపాదించాలి - ఇక్కడ ఈ దేశంలో దొరకని స్వేచ్ఛా విలాసాలను అక్కడ అనుభవించాలని మీ కోరిక. స్వార్థం, పట్టుదల మిమ్మల్ని దూరంగా ఆలోచించ నివ్వలేదు.

ఏ నేరమూ చేసి ఎరుగని నేను యిన్ని సంవత్సరాలుగా ఎంత వేదనకి గురి అయ్యానో మీరు అర్థం చేసుకోలేరు. ఆ అవసరమూ మీకు లేదు.

మనిషి - మనసు - మమతలకంటే ధనానికి మీరెక్కువ ప్రాముఖ్యత యిస్తారని నా అభిప్రాయం. డబ్బుని కొనుక్కోలేని మమతల విలువ మీ కిప్పుడే అర్థంకాదేమోకూడా!

మిమ్మల్ని ఎక్కువగా విసిగించటం నా అభిమతంకాదు. మీరు విడాకులు తీసుకుని తిరిగి అమెరికా వెళ్ళాలన్న ప్రయత్నంలో వున్నారని తెలిసింది.

బాబు, మా అమ్మా-నాన్నల దగ్గర పెరుగుతున్నాడు. వాడిగురించి మీకు ఏ మాత్రం ఆసక్తి వున్నా, ఈ సంవత్సరం కాలంలో ఒక్కసారి అయినా వచ్చిచూసి వుండేవారు.

ఇంకా ఏ మూలో మిగిలివున్న ఆశతో మీ కోసం, మీ పిలుపుకోసం ఎంతగానో ఎదురు చూస్తూ యిన్ని సంవత్సరాలు గడిపాను. నేను పుట్టి పెరిగిన వాతావరణం, తరతరాలుగా రక్తంలో జీర్ణించుకునిపోయిన సంప్రదాయాలూ, ఆ గుడ్డి నమ్మకాన్ని నిలిపాయి. నా నిరీక్షణ వ్యర్థం అని నాకు తెలుసు.

నా డబ్బుతో ప్రమేయం లేకుండా నన్ను అర్థం చేసుకుని అభిమానించే వ్యక్తి నా జీవితంలో తారసపడ్డారు.

మన మధ్య అనురాగాన్ని సృష్టించలేని వివాహం కేవలం బంధంగానే మిగిలివుంది ఇంత కాలం. మీకు అన్ని విధాలా అడ్డుగా వున్న ఆ బంధాన్ని త్రెంచే ప్రయత్నాలు చాలా త్వరలోనే జరుగుతాయి.

మమత లెరుగని మీ వద్ద నా బాబుకోసం ఒక్క నయాపైసా కూడా తీసుకోవటం నాకిష్టంలేదు. కనుక మీకెలాంటి బాధ లేకుండా ఎంతకాలంగానో ఎదురుచూస్తూ ప్రయత్నిస్తున్న విడాకుల సమస్య చాలా సులభంగా పరిష్కారమవుతుంది.

మరింక సెలవు తీసుకుంటాను.

— వసుంధర.

సారథి ముఖం పాలిపోయింది. టేబులుమీద వున్న బెర్నార్డ్ షా పుస్తకంలో మొదటి పేజీలు గాలికి కదులుతూ వుంటే వాటి వైపు చూస్తూ వుండిపోయాడు.